క్లుప్తంగా

చేనేత కార్మికుల కోసం 'స్పందన'

మదనపల్లె: చేనేత కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈనెల 8వతేదీ మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంలో చేనేతకార్మికులు తమ సమస్యలకు సంబంధించి వినతులు, అర్జీలు,దరఖాస్తులు ఇవ్వవచ్చునన్నారు. జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు.గ్రీవెన్స్ ఫిర్యాదులే కాకుండా చేనేత, జౌళిశాఖ అమలు చేస్తున్న ముద్ర రుణాలు, చేనేత వృద్ధాప్య పింఛను ధృవీకరణ పత్రాలు, చేనేత సంబంధిత అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అవకాశాన్ని చేనేతకార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయండి

నిమ్మనపల్లె: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పక్కాగృహం పథకంలో మంజూరు చేసిన గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ అమరనాథ్ అన్నారు. ఆదివారం దండువారిపల్లె లే అవుట్‌లో గృహనిర్మాణ పనులను పరిశీలించారు. మండలంలో 2,142 మందికి పక్కా గృహాలు మంజూరు చేయగా 1288 మంది నిర్మాణ పనులు పూర్తి చేశారన్నారు. మిగిలిన పక్కా గృహాలు వివిధ దశలో ఉన్నాయన్నారు. పక్కా గృహాల నిర్మాణాలకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.26.22 కోట్ల నిధులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిందన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిర్మాణ పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామసముద్రం: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పుంగనూరు పరిధిలోని రామసముద్రం మండలం మాలేనత్తం పంచాయతీ చింపరపల్లె గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్లు సూపర్‌వైజర్ సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. వివాహితులు పదవ తరగతి పాసైన వారు ఈనెల 11లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కురబలకోట:

మిట్స్ మోడల్ ఈఏపీసెట్‌కు అనూహ్య స్పందన

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఆన్‌లైన్ మోడల్ ఈఏపీసెట్–23కు విశేష స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి 1260 మంది ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించే మొదటి పది మందికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే ఏపీఈఏపీసెట్ పై భయాన్ని తొలగించడం, అవగాహన పెంచేందుకు ఆపై అనుభవం కోసం ప్రతి ఏటా మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈపరీక్ష నిర్వహించడం జరుగుతోందన్నారు. కళాశాల పీఆర్వో మారుతీ ప్రసాద్, ఏఓలు శ్రీనివాసులు, రియాజ్, ఏపీఆర్వో ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం గొల్లపల్లె రింగోడ్డుకు చెందిన సుబ్బన్న భార్య సిద్ధమ్మ (75) కలకడలో నివాసం ఉన్న పెద్ద కుమారుడు రవీంద్ర ఇంటికి ఆదివారం జాతర ఉండడంతో చిన్న కుమారుడు నాగయ్యతో కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరింది. మార్గ మధ్యం లోని సీటీఎం స్పిన్నింగ్ మిల్లు వద్ద, ఎదురుగా వస్తున్న భార్గవ్, అతని భార్య అంకితలు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం వారిని ఢీకొంది. ప్రమాదంలో సిద్ధమ్మ కిందపడి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. బాధితురాలిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికితరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సర్కారీ విక్ర'మార్కు'లు

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు
- ప్రతిభతో రాణించిన పేదింటి పిల్లలు
- కార్పొరేట్ సంస్థలకు దీటైన సమాధానం
- టెన్త్‌లో రాణించిన ప్రతిభావంతులు



మదనపల్లె సిటీ : టెన్త్ టాపర్ సందినిని అభినందిస్తున్న డీవైఈఓ, ఎంఈఓ,



పెద్దతిప్పసముద్రం : ప్రతిభ చాటిన విద్యార్థులతో డీవైఈఓ,ఎంఈఓ,

మదనపల్లె సిటీ: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. పాఠశాలల్లో పేద,మధ్య తరగతి వర్గాల విద్యార్థులు మెరికల్లా రాణించారు. వీరి ప్రతిభకు ప్రభుత్వ విధానాలు తోడయ్యాయి. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకువచ్చిన మార్పులు సత్ఫలితాలిస్తున్నాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లుగా విద్యారంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు నిలబడాలనేది ఆయన బలమైన సంకల్పం. అందుకే ఈ రంగానికి నిధులు లోటు రానీయకుండా శ్రద్ధ వహిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఏ పరీక్షా ఫలితాలు వచ్చినా కార్పొరేట్ విద్యా సంస్థలదే పైచేయిగా నిలిచేది. ఇప్పుడు పరిస్థితి కొంత మార్పు వచ్చింది. ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులు కార్పొరేట్‌తో పోటీ పడుతున్నారు. అత్యధిక మార్కులు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. గుణాత్మక విద్యా విధానం, బోధన,బోధనేతర సిబ్బంది నియామకాలు, మౌళికవసతులు వంటి అంశాలు ప్రభుత్వ బడులు మందడుగుకు దోహదపడుతున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో వివేకానంద మున్సిపల్ పాఠశాలలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాయి. అందులో చేనేత కుటుంబాల పిల్లలు కార్పొరేట్‌కు ధీటుగా 500 మార్కులుపైగా సాధించి ఔరా అనిపించుకున్నారు. దీంతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించారు.

సత్తా చాటిన జెడ్పీ విద్యార్థులు

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటతారు. ఆదివారం పాఠశాలలో 500 మార్కులుపైగా వచ్చిన 35 విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాల టాపర్ రెడ్డిరాఘవిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డన్నశెట్టి, ఉపాధ్యాయులు ఫణీంద్ర, మహమ్మద్‌ఖాన్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

నిమ్మనపల్లె : పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యధిక మార్కులు సాధించారు. రెడ్డివారిపల్లె మోడల్‌స్కూల్ విద్యార్థి కె.పవన్ 572 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. నిమ్మనపల్లె జడ్పీ హైస్కూల్ (తెలుగు) విద్యార్థినిలు సి.నిహారిక, పి.ప్రతిభలు 570 మార్కులతో ఉమ్మడిగా ద్వితీయ స్థానం సాధించారు. 569 మార్కులతో డి.శేషాద్రి తృతీయ స్థానం సాధించాడు. జడ్పీ హైస్కూల్ బాలినాయునిపల్లెలో ఆర్.పవన్‌కుమార్ 534 మార్కులు, వి.విమల 523 మార్కులు సాధించారు. నిమ్మనపల్లె ఉర్దూ హైస్కూల్‌లో ఎస్.రేష్మా 545 మార్కులు, ఎస్.కలీమూన్ 531 మార్కులు సాధించారు. రెడ్డివారిపల్లె జడ్పీ హైస్కూల్ కె.హరిప్రసాద్ 512 మార్కులు సాధించగా, కె.మహేశ్వరి 490 మార్కులు సాధించారు. కేజీబీవీ విద్యాలయం విద్యార్థి డి.రమ్య 518 మార్కులు, ఎం.అలేఖ్య 501 మార్కులు, రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్.మహ్మద్‌సాదిక్ 556 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్ఎంలు శ్రీదేవి, అరుణ, చిట్టిబాబు, రమణారెడ్డి, ప్రిన్సిపాళ్లు కేఎస్ఎస్.మూర్తి, మునివెంకటమ్మలు అభినందించారు.

పది ఫలితాల్లో ఎదురు లేని మోడల్ స్కూల్

కురబలకోట: మండలంలోని ముదివేడు దగ్గరున్న ప్రభుత్వ మోడల్ స్కూల్ పది ఫలితాల్లో ఎదురలేదని నిరూపించుకుంది. మండలంలోనే ఈ స్కూల్ ప్రథమ స్థానంలో నిలచినట్లు ఎంఈఓ ద్వారకనాథ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యోజన గాంధి ఆదివారం తెలిపారు. ఈ స్కూల్ విద్యార్థి ఎ.మల్లికార్జున 600కు 590 మార్కులు మండలంలో ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు రాష్ట్ర స్థాయిలో పదిలోపు ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. 91 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 72 మంది ఫస్ట్ క్లాసు, ఆరు మంది సెకండ్ క్లాసులో పాసయ్యారు. 86 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇదే స్కూల్‌కు చెందిన బి.తేజస్ 577 మార్కులు సాధించాడు.

టాపర్‌లను అభినందించిన డీవైఈఓ

పెద్దతిప్పసముద్రం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మదనపల్లి డీవైఈఓ క్రిష్ణప్ప ఆదివారం అభినందించారు. ముఖ్యంగా పీటీఎం తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు తో 585 మార్కులు సాధించిన లిఖిత్ కుమార్ రెడ్డి, రంగసముద్రం స్కూల్‌లో రెండో ర్యాంకు 570 మార్కులతో ప్రత్యూష, ఏపీ మోడల్ స్కూల్‌లో మూడో ర్యాంకు 566 మార్కులు సాధించిన అమర్ కిరణ్‌లను అభినందించారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎంఈఓ నారాయణ, ఆయా హైస్కూళ్ళ హెచ్ఎంలు శంకరయ్య, గౌస్‌పీర్, ప్రిన్సిపాల్ శివకుమారిలను డీవైఈఓ ప్రశంసించారు.



పవన్ (572)



నిహారిక (570)



పి. ప్రతిభ (570)



డి. శేషాద్రి (569)



సాదిక్ (556)



ఎ. మల్లికార్జున (590)



బి. తేజస్ (577)



రెడ్డి జస్వంత్ (573)

ఘనంగా ఠాగూర్ జయంతి

వాల్మీకిపురం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఠాగూర్, అల్లూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ రచయిత, విద్యావేత్త రవీంద్రనాథ్ ఠాగూర్ మన దేశానికి జాతీయ గీతాన్ని అందించారని, ఆయన రచించిన గీతాంజలి గేయాలకు నోబెల్ బహుమతి లభించిందన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ పోరాటం ప్రతి తెలుగువాడికి శౌర్య పరాక్రమాలను గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, నాగరాజ, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆలయకింది భాగంలోని దిగువ తొట్టివారిపల్లెలోని కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ మెట్లకు పసుపుకుంకుమలు,కర్పూర హారతులతో పూజలు చేశారు.

ఘనంగా చక్రస్నానం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాల మధ్య ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం చేశారు. ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని ఉదయం ఆలయంలో వసంతోత్సవం చేశారు.

గ్రామాల్లో వైభవంగా జాతర మహోత్సవాలు



దీలు బోనాలు సమర్పిస్తున్న మహిళలు



ప్రత్యేకాలంకరణలో ఉలవల గంగమ్మ



ప్రత్యేక అలంకరణలో ఒస్కోటమ్మ

వాల్మీకిపురం: పట్టణంలోని వెంగమాంబ ఆర్చి వద్ద వెలసిన శక్తిమాత అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, తోమాలసేవ, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని, అమ్మవారికి దీలు, బోణాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో అమ్మవారి నగరోత్సవం, చాందిని బండ్ల ప్రదర్శన వైభవంగా నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉలవల గంగమ్మ తిరునాల

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో వెలసిన శ్రీ ఉలవల గంగమ్మ తిరునాల ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం అమ్మవారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాసకల్యాణం నాటకం ప్రదర్శన ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఆసాదికథ, కోలాటాలు, చక్కభజనలు, చాందినీబండ్లు మొక్కుబడులు చెల్లింపు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు మల్లికార్జునాయుడు, సాగర్‌రెడ్డి, హరినాథనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఒస్కోటమ్మ తిరునాల

గుర్రంకొండ: మండలంలోని సంగసముద్రం గ్రామదేవత ఒస్కోటమ్మ తల్లి తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలో మహిళలు అమ్మవారికి బోనాలు, దివిటీలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మేళతాళాలతో, బాణాసంచా పేల్చుతూ పెద్ద ఎత్తున చాందినీబండ్లు తరలివచ్చాయి. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో వచ్చిన చాందినీ బండ్లు అందర్ని ఆకట్టుకొన్నాయి. తిరునాల సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్తులు అమ్మవారి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొన్నారు.

వైభవంగా చీనేపల్లె ఎల్లమ్మ తిరునాల

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ చీనేపల్లెలో పౌర్ణమిని చీనేపల్లె ఎల్లమ్మ (చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ) తిరుణాల వైభవంగా జరిగింది. చీనేపల్లెలో వెలసిన చిన్నక్కమ్మ, పెద్దక్కమ్మ అమ్మవార్లకు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పూజలు నిర్వహించారు. భక్తులు నవధాన్యాలతో తయారు చేసిన మొలకలు, బోణాలు అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.

సువర్ణ పాలన కోసం జనన్నను ఆశీర్వదించాలి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి

కేవీపల్లె : రాష్ట్రంలో సువర్ణ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మార్రేళ్లలో ×మా నమ్మకం నీవే జగన్, జగనన్నే మా భవిష్యత్తు¤ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏమైనా ఆశిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థికంగా ప్రయోజనం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పొత్తపు సతీష్‌రెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి, రామకొండారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ: వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఎస్‌డీఓ షేక్ షఫీ తెలిపారు. జిల్లాలో 50 విభాగాల్లో సమ్మర్ కోచింగ్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. అథ్లెటిక్, స్విమింగ్,బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్యారమ్స్, చెస్, పుట్‌బాల్, హ్యాండ్‌బాల్,హాకీ, కబడ్డీ, ఖోఖో, కరాటే, యోగా, వాలీబాల్, టేబుల్ టెన్నీస్‌లలో ప్రత్యేక శిక్షకులతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణను క్రీడాభిమానులు పాల్గొనాలని కోరారు. వేసవిలో క్రీడల్లో మెలకువలు నేర్చుకోవాలన్నారు. ముగింపులో క్రీడల్లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు.

పీలేరు : స్థానికి గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి అమర్‌నాథ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, పేపర్ ఆర్ట్, పుస్తక పఠనంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పంచాయతీ ప్యారంపల్లి, గొళ్లపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు.

ఘనంగా భద్రాద్రి రామస్వామి కల్యాణోత్సవం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో నూతనంగా నిర్మించిన సీతాసమేత భద్రాద్రి రామస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. వేద పండితులు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో కల్యాణం తంతు నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమాలు చేశారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆనందరెడ్డి ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. వేదపండితులు ఆశీర్వాదాలు ఇచ్చారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. సాయంత్రం స్వామిని పుష్పపల్లకీపై ఊరేగించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, మాజీ కౌన్సిలర్ నీరుగట్టు వెంకటరమణారెడ్డి ,పుల్లారెడ్డి, సదాశివారెడి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యత



ఆక్షా మసీదులో కొత్త మోటారు అమర్చుతున్న దృశ్యం

పీలేరు : తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక ఆక్షా మసీదులో కొత్త బోరుకు మోటారు, పైపులైను అమర్చారు. అలాగే కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ వద్ద మరమ్మతులకు గురైన పంపుసెట్లు రిపేరు చేపించారు. పనులను పర్యవేక్షించిన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో కొత్త బోర్లు, మోటార్లు, పైపులైన్లు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.వి. చలపతి, పెద్దోడు, గడిబాషా, అల్లాబక్షు, కుసుమశేఖర్‌రెడ్డి, ఈవో ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం శ్రీపోలేరమ్మ తల్లి

గుర్రంకొండ: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమై విరాజిల్లుతోంది శ్రీపోలేరమ్మతల్లి. గుర్రంకొండ మేజర్ పంచాయతీ గ్రామదేవతైన అమ్మవారి తిరునాల ఈనెల 08 నుంచి 10వరకు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. గుర్రంకొండను నవాబుల పరిపాలించే కాలంలో వారి చేత పూజలందున్న చల్లని తల్లి పోలేరమ్మ. అమ్మవారు యుద్ధసమయాల్లో నవాబు సైన్యాలను ముందుండి నడిపించేదని గ్రామపెద్దల నమ్మకం. శత్రురాజుల కదిలకలను నవాబుల కలలో కనబడి చెప్పేదని గ్రామపెద్దలు నేటికి కథలుగా చెబుతుంటారు. అందుచేతనే మతాలకు అతీతంగా పోలేరమ్మ ముస్లిం నవాబుల చేత కూడా ఘనంగా పూజలందుకొనేది. అంతటి ఘన చరిత్ర కలిగిన పోలేరమ్మ తల్లి ఆలయంలో ఈనెల 08 సోమవారం కోటలోని శ్రీ శిలేమాతమ్మకు, కొత్తపేటలోని శ్రీపోలేరమ్మ తల్లులకు మహిళలు దివిటీలు,బోణాలు ఘనంగా సమర్పించనున్నారు.

కనుల పండువగా ద్రౌపది కల్యాణం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం ద్రౌపది కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం మహాభారత యజ్ఞం వద్ద ద్రౌపది అమ్మవారు, పంచ పాండవుల విగ్రహాలను వధూవరులుగా అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్రాలతో ద్రౌపది కల్యాణం కమనీయంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి మాంగళ్య ధారణ కార్యక్రమం చేపట్టారు. ఉభయదారులు పి.ఎస్.ఎం. రాజు భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం భాగవతారిణి మునిలక్ష్మీ ద్రౌపది కల్యాణం ఘట్టంపై హరికథా గానం చేశారు. రాత్రి ద్రౌపతి కల్యాణం నాటకం ప్రదర్శించారు.